RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

దిన పత్రిక

సానుకూల ఆలోచనలు
ఉన్నవారికి ఆనందం నీడలా
వెంటే ఉంటుంది


- గౌతమ బుద్ధుడు

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్ సంపుటి : 04 సంచిక : 210
బుధవారం, జూలై 15, 2026, పేజీలు - 4 వెల : 2/-

## రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులపై బిగ్ అప్‌డేట్..

### కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

హైదరాబాద్, జూలై 14:కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణకు సంబంధించిన కీలక రహదారి ప్రాజెక్టులపై చర్చించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి వెంటనే కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపాలని.. దక్షిణ భాగానికి అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్-అమరావతి 12 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే.. మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్.. మంచిర్యాల-హైదరాబాద్ నేషనల్ హైవేకి కూడా కేంద్ర సహకారం కోరారు. ఇవి రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, రవాణా, పారిశ్రామిక రంగాలకు కీలకమని పేర్కొన్నారు. తెలంగాణలో మౌలిక వసతుల అభివృద్ధికి వేగం పెంచేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన సాగుతోంది. ఇందులో భాగంగానే కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో



సీఎం రేవంత్ రెడ్డి కీలక సమావేశం నిర్వహించారు. రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్), హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే.. మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్, మంచిర్యాల-హైదరాబాద్ జాతీయ రహదారి వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులపై రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన ఈ ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తి అయిందని నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ వివరించారు. వెంటనే కేంద్ర కేబినెట్ ఆమోదం మంజూరు చేసి ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే సమయంలో ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి కూడా వెంటనే అనుమతులు ఇచ్చి భూసేకరణ ప్రారంభించేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఉత్తర, దక్షిణ భాగాల పనులు ఒకేసారి ప్రారంభమైతే నిర్మాణం వేగంగా పూర్తి కావడంతో పాటు వ్యయం కూడా తగ్గుతుందని వివరించారు.

### తెలంగాణ అభివృద్ధి కోసం ఆ

## విమానాశ్రయాలు అవసరం

: సీఎం రేవంత్‌రెడ్డి



ఢిల్లీ, జూలై 14 : వరంగల్ విమానాశ్రయం ఆకృతిలో కాకతీయ సంస్కృతికి పెద్దపీట వేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయిడుతో చర్చించామని తెలిపారు. రెండు ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్రమంత్రి సహకరిస్తున్నారని వెల్లడించారు. దేశ జనాభాలో 2.50 శాతం జనాభా ఉన్న తెలంగాణ.. 5 శాతం జీడీపీ వాటా కలిగి ఉందని చెప్పుకొచ్చారు. ఈరోజు (మంగళవారం) ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుని కలిశారు. ఈ సందర్భంగా మీడియాతో సీఎం మాట్లాడారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆ స్ఫూర్తి కొనసాగుతోంది...తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలంటే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విమానాశ్రయాలు అవసరమని సీఎం తెలిపారు.

### మూడు జిల్లాల్లో పర్యటించనున్న సీఎం రేవంత్..



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం మూడు జిల్లాల్లో పర్యటిం చను న్నారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో పర్యటించి పలు ప్రారం భోత్స వాలు, శంకుస్థాపన కార్యక్రమాలకు శ్రీకారం చుట్ట నున్నారు. రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సి టీలో అమెజాన్ డేటా సెంటర్‌కు సీఎం రేవంత్ భూమిపూజ చేయనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమరరాజా సెల్ తయారీ యూనిట్‌ను ప్రారంభించనున్నారు. అలాగే వ నపర్తి జిల్లా కొత్తకోటలో బాలికల ఉన్నత పాఠశాల భవనం ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది.సీఎం రేవంత్ రెడ్డి అధికారిక పర్యటన షెడ్యూల్ ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం 12:00 గంటలకు శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీకి బయలుదేరుతారు. 12:15 గంటలకు ఫ్యూచర్ సిటీలోని అమెజాన్ డేటా సెంటర్ వేదికకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12:15 నుంచి 12:45 గంటల మధ్య అమెజాన్ డేటా సెంటర్‌కు భూమిపూజ చేస్తారు. అనంతరం 12:50 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లికి పయనమవుతారు. మధ్యాహ్నం 1:15 గంటలకు దివిటిపల్లి చేరుకుని, 1:20 నుంచి 2:20 గంటల మధ్య అమరరాజా సెల్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ప్రారంభోత్సవం, ప్లాంట్ సందర్శన, అనంతరం ప్రసంగం చేయనున్నారు.

## తెలంగాణలో సర్ గడువును పొడిగించండి..

### ఈసీకి మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 14: తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణగడువును పొడిగించాలంటూ ఈసీకి మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఈరోజు(మంగళవారం) మంత్రి పొన్నం నేతృత్వంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని కాంగ్రెస్ ప్రతినిధుల బృందం కలిసింది. ఈ సందర్భంగా తెలంగాణలో గడువు పొడిగించాలని కాంగ్రెస్ నేతలు అభ్యర్థించారు. ఓటరు నమోదు ప్రక్రియకు మరింత సమయం ఇవ్వాలన్నారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఓటరు సవరణ ప్రక్రియ నత్తనడకన సాగుతోందన్నారు. హైదరాబాద్‌లో కేవలం 21% ఓటరు సవరణే పూర్తయిందని చెప్పారు. ఇంకా 10 రోజుల



గడువు మాత్రమే ఉందన్నారు. అది సరిపోదని.. సర్ గడువును పొడిగించాలని కోరారు. హైదరాబాద్‌లో 4,500 పోలింగ్ స్టేషన్లలో ప్రక్రియ నత్తనడకన సాగుతోందని మంత్రి వెల్లడించారు. బూత్ స్థాయి అధికారులు ఇళ్లకు రావడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలు సరిగా ఇవ్వడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నా యన్నారు. అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా తొలగిపోకూడదని చెప్పుకొచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు పార్టీ క్యాడర్ చురుకుగా పనిచేయాలని సూచించారు. ఓటు లేక పోతే ప్రభుత్వ పథకాలు రావనే ప్రచారం కూడా జరుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## బోనాలు శాంతియుతంగా

# నిర్వహించడమే లక్ష్యం

హైదరాబాద్, జూలై 14: ఆషాడ బోనాల ఉత్సవాలు శాంతియుతంగా, వైభవంగా నిర్వహించడమే లక్ష్యమని హైదరాబాద్ నగర్ సీపీ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ బోనాలు.. మొదటి 15 రోజులు అత్యంత కీలకమని తెలిపారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. మంగళవారం బంజారా హిల్స్ లోని టీజీఐసీసీసీలో ఆషాడ బోనాలపై ఆ శాఖ అధికారులతో నగర సీపీ సమీక్ష నిర్వహించారు. ఈ బోనాలకు పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.జూలై 16 నుంచి ఆగస్టు13వ తేదీ వరకు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గోల్కొండ, బల్కంపేట, ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ ఆలయాలపై ప్రత్యేక దృష్టి



పెట్టాలని చెప్పారు. టాస్క్‌ఫోర్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సిటీ ఆర్మ్‌డ్, రిజర్వ్, క్విక్ రియాక్షన్ టీమ్స్ భారీగా మోహరిస్తున్నట్లు వివరించారు.భక్తులకు సమాచారం కోసం ఆలయాల వద్ద పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ వివరించారు. మహిళా భక్తుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని.. అందుకోసం షీ టీమ్స్‌తో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈవ్ టీజింగ్, గొలుసు దొంగతనాలు, మొబైల్ స్నాచింగ్, జేబుదొంగలపై ఉక్కుపాదం మోపనున్నట్లు చెప్పారు.గత బోనాల్లో 644 మంది ఆకతాయిలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని ఆయన గుర్తు చేశారు. బోనాల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు, ఘటాల ఊరేగింపులకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని వివరించారు. ఆలయాల పరిసరాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు.

### కడియం శ్రీహరిపై మీనాక్షి నటరాజన్‌కు

## మంత్రి సురేఖ ఫిర్యాదు..



హైదరాబాద్: తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య వివాదం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ వద్దకు చేరింది. ఈ విషయంపై మీనాక్షి నటరాజన్‌తో ఇవాళ (మంగళవారం) మంత్రి కొండా సురేఖ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఆమె ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే కడియం తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని, అనవసర వివాదాల్లోకి లాగుతున్నారని మీనాక్షి నటరాజన్ దృష్టికి సురేఖ తీసుకెళ్లారు.అలాగే ఇద్దరి మధ్య నెలకొన్న వివాదానికి సంబంధించిన అన్ని అంశాలను నటరాజన్‌కు వివరించారు. మంత్రి సురేఖ వివరించిన అన్ని అంశాలను ఓపికగా విన్న తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ సంయమనం పాటించాలని మంత్రికి సూచించారు. అయితే, తన పని తాను చేసుకుంటుంటే అనవసరంగా బయటకు రప్పిస్తున్నారని కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిన్నచిన్న విషయాలను పెద్దగా పట్టించుకోవద్దని సురేఖకి మీనాక్షి నటరాజన్ సూచించారు. కాగా, ఈ వివాదంపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను
కలిసి ఎమ్మెల్యే కడియంపై మంత్రి సురేఖ ఫిర్యాదు చేశారు.

### ఇరాన్‌లోని ఆ అణుకేంద్రం

## మా టార్గెట్స్ లిస్టులో ఉన్నది

: డొనాల్డ్ ట్రంప్




అమెరికా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్ పై కఠిన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లోని 'పిక్‌యాక్స్ మౌంటెన్ అణు కేంద్రం అమెరికా లక్ష్యాల జాబితా ఉన్నదని చెప్పారు. ఆ అణు కేంద్రాన్ని ఎప్పటికప్పుడు నిశితంగా గమని స్తున్నామని వెల్లడించారు. అవసరమైతే త్వర లోనే అక్కడ కూడా దాడి జరిగే అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. స్పేస్ ఫోర్స్‌తోపాటు ఇతర వ్యవస్థల ద్వారా ఆ కేంద్రంపై నిరంతరం నిఘా కొనసాగుతోందని ట్రంప్ వెల్లడించారు. ప్రస్తుతం అక్కడ ఎలాంటి కదలికలు కనిపించడం లేదని చెప్పారు. ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించిన సమాచారం వచ్చినప్పుడల్లా దాన్ని అడ్డుకుంటున్నామని తెలిపారు. ఇరాన్‌తో ఒప్పందం దాదాపు ఖరారయ్యే దశలో ఆ దేశమే వెనక్కి తగ్గిందని ట్రంప్ ఆరోపించారు. ఒప్పందాలను ఉల్లంఘించడం ఇరాన్‌కు అలవాటేనని విమర్శించారు.ఇరాన్ నాయకత్వంపై కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వారి చేతికి అణ్వాయుధం దక్కితే దాన్ని వినియోగించడానికి ఏమాత్రం వెనుకాడరని ఆరోపించారు. అయితే ఆ దేశ నాయకులపై తీసుకునే చర్యల గురించి మాత్రం మాట్లాడేందుకు ఆయన నిరాకరించారు. వైట్‌హౌస్‌లో జరిగిన మరో కార్యక్రమంలో కూడా ట్రంప్ ఇదే అంశంపై స్పందించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఇరాన్‌కు
అణ్వాయుధం దక్కనివ్వబోమని స్పష్టంచేశారు.

## పోలవరం ప్రాజెక్టు పర్యాటక అభివృద్ధి

### సీఎం చంద్రబాబు సమీక్ష..

అమరావతి: పోలవరం ప్రాజెక్టు పర్యాటక అభివృద్ధిపై తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు సహా పరిసర ప్రాంతాల్లో పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధిపై ఇరిగేషన్ శాఖ అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులతో ఆయన కీలకంగా చర్చించారు. ఈ సందర్భంగా వచ్చే ఏడాది నాటికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేయాలని అధికారులకు సీఎం చంద్రబాబు తెలిపారు.

ఈ మేరకు ప్రాజెక్టు పనులకు అనుబంధంగా పర్యాటక పనులను వేగవంతం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పోలవరం నుంచి ఎగువన ఉన్న భద్రాచలం సమీపం వరకు పర్యాటక అభివృద్ధిపై అధికారులతో కీలక చర్చ జరిపారు. ఏపీ పరిధిలో గోదావరి




నదికి, ప్రాజెక్టుకు ఇరువైపులా పర్యాటక అభివృద్ధిపై దిశానిర్దేశం చేశారు. సమృద్ధిగా నీటి వనరులు, పచ్చని కొండలు, అటవీ ప్రాంతాలతో పోలవరం మంచి పర్యాటక కేంద్రంగా నిలిచే అవకాశం ఉందని అధికారులకు సీఎం తెలిపారు. పలు ప్రాజెక్టులు చేపట్టడం ద్వారా పర్యాటక రంగంలోనూ పోలవరం ఖ్యాతిని చాటేలా ప్రణాళిక ఉండాలని అన్నారు.ఈ సందర్భంగా రివర్‌ఫ్రంట్ టూరిజం, అడ్వెంచర్ టూరిజానికి ఈ ప్రాంతం అత్యంత అనుకూలమని నిప్పాన్ కోయి ఇండియా సంస్థ ప్రతినిధులు సీఎం చంద్రబాబుకు వివరించారు. ముఖ్యంగా వాటర్ స్పోర్ట్స్‌కు సమృద్ధిగా ఉన్న అవకాశాలను ఆయనకు వెల్లడించారు. అనంతరం కేబుల్-స్టేడ్ బ్రిడ్జి డిజైన్, స్పిల్‌వే బ్యూటిఫికేషన్‌తో పాటు మాస్టర్ ప్లాన్‌పై ఆ సంస్థ ప్రతినిధులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అలాగే పోలవరం చుట్టుపక్కల ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధిపై కీలక విషయాలను వివరించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- ●జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్
- ●ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను జిల్లాలో వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.





**మెదక్ జూన్ 17, 2026( మెదక్ టుడే న్యూస్ ):** మంగళవారం, జిల్లాలోని కొల్చారం మండలం వరిగుంతం గ్రామంలో ఎస్ ఐ ఆర్ ను తాసిల్దార్ ఎంపీడీవోతో కలిసి బిఎల్వోలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను క్షేత్రస్థాయిలో ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ బూత్ స్థాయిలో ఫారాల పంపిణీ, స్వీకరణ, డేటా ఎంట్రీ పురోగతిపై ఆరా తీశారు. ఫారాలు పంపిణీ చేయడం మాత్రమే కాకుండా, పూర్తిగా పూరించిన దరఖాస్తులను తిరిగి సేకరించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబాన్ని సంప్రదించాలని, ఒక కుటుంబంలో ఒక సభ్యుడి మ్యాపింగ్ పూర్తయితే మిగిలిన అర్హులైన సభ్యులందరికీ మ్యాపింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంకా ఫారాలు సమర్పించని కుటుంబాలను గుర్తించి, ప్రత్యేకంగా తిరిగి సంప్రదించాలన్నారు. మరణించిన, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేసి, నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలన్నారు .బిఎల్ఓలు ఓటర్లతో మర్యాదగా వ్యవహరించి, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, బిఎల్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

# గుడిసెలు లేని గ్రామాలే తీర్చిదిద్దటమే లక్ష్యం

- ●మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులు వెంటనే మొదలుపెట్టాలి
- ●నిజమైన అర్హులను గుర్తించి ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇందిరమ్మ ఇల్లు అందించాలి
- ●ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి
- ●మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్







**మెదక్ జూన్ 14( మెదక్ టుడే న్యూస్):** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి అర్హులైన కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. కొల్చారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని హౌసింగ్ పీడీ మాణిక్యం తాసిల్దార్ శ్రీనివాస చారి ఎంపీడీవో రహీం మున్నీసా బేగం, సర్పంచ్ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ముందుగా రెండో విడతలో ప్రాధాన్యతనిచ్చే గుడిసెల ధ్రువీకరణ, మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, రెండో విడత లబ్ధిదారుల ఎంపిక సంబంధిత వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో పారదర్శకత, జవాబుదారీతనం, వేగం ఉండేలా అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమయానికి పూర్తి చేసే దిశగా సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. మొదటి విడతలో మంజూరై సంవత్సరం కావస్తుందని ఇప్పటికీ ప్రారంభించని లబ్ధిదారుల విషయంలో ఇండ్లు మొదలుపెట్టే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రెండో విడత కూడా జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం మంజూరు అవుతుంది కాబట్టి మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల పథకం లక్ష్యాలను సాధించాలన్నారు. జిల్లాలో మొదటి విడతలో 9వేల ఇండ్లు మంజూరు కాగా ఇందిరమ్మ ఇండ్ల పురోగతి 83% పూర్తయిందని ఇప్పటివరకు 1700 ఇండ్లు నిర్మాణం పూర్తి చేసుకుని గృహప్రవేశం చేయడం జరిగిందన్నారు. 2400 ఇండ్లు స్లాబ్ పూర్తి చేసుకుని ఫెన్సింగ్ దశలో ఉన్నాయన్నారు 650 ఇండ్లు రూమ్ లెవెల్లో ఉన్నాయన్నారు. 1400 ఇండ్లు బేస్ మెంట్ లెవెల్లో ఉన్నాయన్నారు మిగతా ఇండ్లు పునాది దశలో ఉన్నాయని తెలిపారు ఇప్పటివరకు 1600 ఇండ్లు లబ్ధిదారులు ఇంకును మొదలుపెట్టలేదని త్వరితగతిన మొదలుపెట్టే విధంగా అవగాహన కల్పించాలన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి నిరుపేద కుటుంబాల వారికి మహిళా సంఘ గ్రూపుల ద్వారా రుణాలు మంజూరు చేసి ఇండ్లు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పథకంలో భాగంగా జిల్లాలో గుడిసెల సర్వే పూర్తయిందని తెలిపారు. గుడిసెల్లో నివాసం ఉండే వారికి మొదటి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం లక్ష్యాలకు అనుగుణంగా. ముందుకు సాగే విధంగా అధికారుల కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చేగుంట సి ఎమ్ ఆర్ కాలనిలోని రఫీ ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయంలో వన మహోత్సవం!

- ● నక్షత్ర వన మహోత్సవం మొక్కలు నాటిన తహసీల్దార్, ఎంపీడీఓ
- ● ఉదయం లేచింది మొదలు మనకు కూరగాయలు, నీరు, ప్రాణవాయువు కావాలి
- ●వీటన్నింటికీ చెట్లేమూ లాధారం ఉప సర్పంచ్ రఫీ

నక్షత్రాల వారీగా మొక్కలు నాటిన భక్తులు!





**చేగుంట జులై 14 మెదక్ టుడే న్యూస్**

చేగుంట పట్టణ కేంద్రంలోని సి ఎమ్ ఆర్ కాలనీ లోని హనుమాన్ దేవాలయంలో వన మహోత్సవ కార్యక్రమం ప్రారంభానికి ముందు వేణుగోపాల శర్మ పంతులు ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి వారికి అత్యంత భక్తిశ్రద్ధలతో విశేష పూజలు జరిపించారు. ఈ పవిత్ర పూజా కార్యక్రమానికి చేగుంట తహసీల్దార్ బల్ లక్ష్మి, ఎంపీడీఓ చిన్న రెడ్డి, సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, ఉపసర్పంచ్ రఫీలతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులందరూ హాజరై స్వామివారి దివ్య మంగళ హారతులు, తీర్థప్రసాదాలను స్వీకరించి, వేద పండితుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం ఉపసర్పంచ్ రఫీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'నక్షత్రాల వన మహోత్సవం' కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో 27 రకాల నక్షత్రాల పేరుతో ఉన్న ప్రత్యేకమైన మొక్కలను మండల అధికారులు, చేగుంట పాలకవర్గం, గ్రామస్తులు నాటారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు సైతం ఎంతో ఉత్సాహంగా పాల్గొని, వారి వారి జన్మ నక్షత్రాల ప్రకారం మొక్కలను నాటారు. అనంతరం ఎంపీడీఓ చిన్నా రెడ్డి మాట్లాడుతూ.. గతంలో తాము కామారెడ్డిలో ఉన్నప్పుడు ఏర్పాటు చేసిన 'రాశి వనం' తరహాలోనే ఇక్కడ కూడా నక్షత్ర వనాన్ని అద్భుతంగా తీర్చిదిద్దినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఆలయ ప్రాంగణంలో చిన్నపాటి వాకింగ్ ట్రాక్, ప్రహరీ గోడ ఏర్పాటు చేసుకుంటే భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని సూచించారు. అలాగే హరితహారంలో భాగంగా మండలంలో ప్రతి ఇంటికీ ఆరు మొక్కలు అందజేస్తున్నామని, వాటిని కూడా ప్రజలు బాధ్యతగా పెంచాలని కోరారు. అనంతరం ఉపసర్పంచ్ మొహమ్మద్ రఫీ మాట్లాడుతూ.. "ఉదయం లేచింది మొదలు మనకు కూరగాయలు, నీరు, ప్రాణవాయువు కావాలి. వీటన్నింటికీ చెట్లే మూలాధారం. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రతి నియోజకవర్గంలో కోట్ల మొక్కలు నాటడాన్ని ఒక లక్ష్యంగా పెట్టుకోవాలి" అని పిలుపునిచ్చారు. అలాగే పర్యావరణ రక్షణకు, మానవ మనుగడకు చెట్లే ప్రాణాధారమని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు బాగా పండాలని ఆ భగవంతుడిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో బాల్ లక్ష్మి, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఏపీఓ శ్వేత, చేగుంట గ్రామ సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్ , ఉప సర్పంచ్ మొహమ్మద్ రఫీ, వార్డ్ మెంబర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్ల నవీన్ కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాజనకు రామచంద్రశీ,స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# నార్సింగి గ్రామంలో 30కు పైగా సీఎం రిలీఫ్ ఫండ్ సిఎం రిలీప్ పండ్ (సి. ఎం ర్ ఫ్ )చెక్కుల పంపిణీ

**- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేత**









**పాపన్నపేట, జూలై 14 (మెదక్ టుడే):** మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నార్సింగి గ్రామ ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సి ఎం ర్ ఫ్ ) ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామానికి ఇప్పటివరకు సుమారు 30కు పైగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరుకాగా, వాటిని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పుంటికూర నారాయణ గౌడ్ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతోందని అన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వై. నర్సింలు, చాకలి నర్సింలు, వార్డు సభ్యుడు శ్రీరామ్ నవీన్ పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. గ్రామ ప్రజలు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అవసరమైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి కొనసాగుతుందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మరెల్లి అనిల్ ప్రథమ వర్ధంతి ఘనంగా నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు




**మెదక్ జూన్ 14( మెదక్ టుడే న్యూస్):**
కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో దివంగత నాయకులు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మరెల్లి అనిల్ ప్రథమ వర్ధంతి వేడుకలు స్వగృహమైన పైతరం గ్రామంలో ఘనంగా జరిగాయి ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ?పార్టీకి అనిల్ చేసిన సేవలు అనన్య సామాన్యం
ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏళ్ళుగారి శ్రీనివాస్ మాట్లాడుతూ?కొల్చారం మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరెల్లి అనిల్ చేసిన సేవలు ఎంతో గుర్తుంచుకోదగినవని తెలిపారు
ఆయన హఠాన్మరణం పార్టీకి తీరని లోటని పేర్కొంటూ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.
అనిల్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.
త్వరలోనే కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతో మాట్లాడి, కుటుంబాన్ని ఆర్థికంగా, అన్ని విధాలా ఆదుకోవడానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో
చందాపురం మధుసూదన్ రెడ్డి
బండి మల్లేశం మండల బీసీ సెల్ అధ్యక్షులు
అచ్చెనపల్లి శ్రీరాములు మండల కిసాన్ సెల్ అధ్యక్షులు
కుమ్మరి భూమేష్ గ్రామ శాఖ అధ్యక్షులు
లక్ష్మీనారాయణ, ఇబ్రహీం, శేఖర్, ప్రభాకర్, మహేష్, స్వామి, ఉపేందర్ గౌడ్ పాల్గొన్నారు

# చేగుంట మహంకాళి ఆలయంలో పసుపు అభిషేకాలుశ్రీ వారాహి గుప్త నవరాత్రులు

**చేగుంట జులై 14 మెదక్ టుడే న్యూస్**




చేగుంట పట్టణ కేంద్రంలోని శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో లోక కళ్యాణార్థం అమావాస్య, మంగళవారం పురస్కరించుకుని శ్రీ మహంకాళి అమ్మవారికి 21 పసుపులతో విశేష అభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చేగుంట మండల గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, రైతులు, అన్నదాతలు అందరూ సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ దేవాలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ పురంలో రాఘవేంద్ర శర్మ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలను అంగరంగ వైభవంగా జరిపించారు. ఇదే సందర్భంలో శ్రీ వారాహి నవరాత్రులు (గుప్త నవరాత్రులు) ప్రారంభమవుతున్నందున భక్తజనులందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి సేవలో పాల్గొని అనుగ్రహాన్ని పొందాలని అర్చకులు కోరారు. ఇట్టి పవిత్ర నవరాత్రి మహోత్సవాలను దేవాలయ చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులు, చేగుంట గ్రామ ప్రజలందరూ ఏకతాటిపై నిలబడి అంగరంగ వైభవంగా విజయవంతం చేయవలసిందిగా రాఘవేంద్ర శర్మ పంతులు పిలుపునిచ్చారు.

## ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

**- పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి.**





**రామచంద్రాపురం, జూలై 14:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
నూతన దేవాలయాల నిర్మాణాలకు, అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని వెలిమెల తండాలో గల భవాని మాత దేవాలయంలో విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి సొంత నిధులతో నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, తాండా ప్రజలు పాల్గొన్నారు.

## గణేష్ గడ్డ ఆలయంలో భక్తుల రద్దీ - భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పిస్తున్నామన్న ఆలయ అధికారులు





**పటాన్‌చెరు, జూలై 14:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
“నేడు మంగళవారం, దీనికి తోడు అమావాస్య కలిసి రావడంతో పటాన్‌చెరు పరిధిలోని రుద్రారం గ్రామంలో సుప్రసిద్ధ గణేష్ గడ్డ ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం అంతా కిక్కిరిసిపోయింది. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో లావణ్య , అధికారులు మాట్లాడుతూ.. ‘మంగళవారం మరియు అమావాస్య కావడంతో భక్తుల రద్దీ సాధారణం కంటే అధికంగా ఉంది. భక్తులు ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకునేలా అన్ని ఏర్పాట్లు చేశాం. ఈవో లావణ్య పర్యవేక్షణలో తాగునీరు, క్యూలైన్లు మరియు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాము. రద్దీని దృష్టిలో ఉంచుకుని స్థానిక పోలీసుల సహకారంతో ట్రాఫిక్ నియంత్రణ చేస్తున్నాం. భక్తులు తమ మొక్కులు చెల్లించుకునేందుకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంగణమంతా అత్యంత ఆధ్యాత్మిక వాతావరణంతో వెల్లివిరుస్తోంది’ అని తెలిపారు. భక్తులందరూ సహకరించి, క్రమపద్ధతిలో క్యూలైన్లలో వచ్చి స్వామివారిని దర్శించుకోవాలని, అధికారులకు సహకరించాలని ఆలయ కమిటీ కోరుతోంది.”

# కుటుంబ నియంత్రణపై అవగాహన పెంచుకుందాం: జిల్లా వైద్యాధికారి డా. కె. లలితా దేవి







**సంగారెడ్డి బ్యూరో జులై 14:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని, సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది “తల్లి–శిశు ఆరోగ్యం కోసం గర్భధారణల మధ్య సరైన విరామం పాటిద్దాం – ఆరోగ్యకరమైన కుటుంబాన్ని నిర్మిద్దాం” అనే ప్రధానాంశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు జరిగిన ఈ ర్యాలీని జిల్లా వైద్య ఒ ఆరోగ్య శాఖ అధికారి డా. కె. లలితా దేవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. లలితా దేవి మాట్లాడుతూ, తల్లి మరియు శిశువుల ఆరోగ్యం క్షేమంగా ఉండాలంటే గర్భధారణల మధ్య సరైన విరామం పాటించడం ఎంతో కీలకమని స్పష్టం చేశారు. కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన పెంచుకుని, ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ నియంత్రణ కార్యక్రమ అధికారి డా. కె. నాగ నిర్మల, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు మరియు ఏఎన్ఎంలు పాల్గొని, ప్రజలకు కుటుంబ నియంత్రణ మరియు తల్లి–శిశు సంక్షేమంపై చైతన్యం కల్పించారు. జిల్లా వ్యాప్తంగా జనాభా దినోత్సవం సందర్భంగా ఈ నెల పొడవునా అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని వైద్య శాఖ అధికారులు తెలిపారు.

# బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఈరోజు నుంచి గుప్త నవరాత్రులు (వారాహి) ఉత్సవాలు

**అమీన్‌పూర్ జూలై 14:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ గుట్ట శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో ఈరోజు (జులై 15) నుంచి జులై 23 వరకు గుప్త నవరాత్రులు (వారాహి) ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ఉత్సవాల తొలి రోజు సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు నిర్వహిస్తామని, అనంతరం భక్తులకు ప్రసాద వితరణ ఉంటుందని వివరించారు. శ్రీ వారాహి అమ్మవారి విశేష అనుగ్రహం పొందేందుకు భక్తులు కుటుంబ సమేతంగా అధిక సంఖ్యలో పాల్గొని, ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.



**రికార్డు స్థాయిలో భక్తుల రాక – రూ. 5.19 లక్షల ఆదాయం:**
సోమవారం ఆరుద్ర నక్షత్రం కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారని తెలిపారు. భక్తుల రద్దీతో ఆలయానికి ఎన్నడూ లేని విధంగా అన్నదానం, అభిషేకం టికెట్ల విక్రయాల ద్వారా రూ. 5,19,000 ఆదాయం సమకూరిందని వెల్లడించారు. భక్తులు సమర్పించిన ఈ విరాళాలను పూర్తిగా ఆలయ అభివృద్ధి పనులకే వినియోగిస్తామని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధికి సహ కరిస్తున్న ప్రతి భక్తుడికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**- అమీన్‌పూర్ టైలర్స్ కాలనీలో రూ.55 లక్షలతో నూతన పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన**





**అమీన్‌పూర్, జూలై 14:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన, రక్షిత మంచినీటిని అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని టైలర్స్ కాలనీలో జలమండలి ఆధ్వర్యంలో రూ. 55 లక్షల వ్యయంతో చేపట్టనున్న మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు మంగళవారం ఆయన భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అమీన్‌పూర్ ప్రాంతంలో తాగునీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు నీటి కోసం పడుతున్న ఇబ్బందులను శాశ్వతంగా తొలగించే దిశగా మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. పైప్‌లైన్ పనులు పూర్తయిన తర్వాత కాలనీ వాసులకు తాగునీటి కష్టాలు తీరతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధిలో భాగంగా రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ వంటి అన్ని సౌకర్యాలను మెరుగుపరుస్తూ, ప్రతి కాలనీని ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, జలమండలి జీఎం శ్రీనివాస్ రెడ్డి, డీజీఎం శివ, ఏఈ శ్రీకాంత్ రెడ్డి, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు ఉపేందర్ రెడ్డి, జగదీష్, గోపాల్, రాములు, చంద్రశేఖర్, రాజు, బాల్ రాజ్ తో పాటు స్థానిక నాయకులు, కాలనీ ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆరోగ్య సంరక్షణకు అధునాతన ఆవిష్కరణలు

**గీతం చర్చాగోష్ఠిలో పేర్కొన్న స్వదేశీ, విదేశీ పరిశ్రమ నిపుణులు**

**పటాన్‌చెరు, జూలై 14:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
ప్రపంచ ఆరోగ్య సవాళ్లను పరిష్కరించడానికి అధునాతన మెటీరియల్స్, నూతన చికిత్సా పరిష్కారాల ఆవిష్కరణను రసాయన, జీవశాస్త్ర ఆవిష్కరణలు నడిపిస్తున్నాయని పరిశ్రమ నిపుణులు పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ‘పదార్థాల నుంచి ఔషధాల వరకు: రసాయన, జీవ శాస్త్రాల పాత్ర’ అనే అంశంపై మంగళవారం ఒకరోజు చర్చాగోష్ఠిని ఏర్పాటు చేశారు. ఆరోగ్య సంరక్షణ, బయోమెడికల్ సైన్సెస్ ను అభివృద్ధి చేయడంలో రసాయన, జీవ శాస్త్రాలు పోషిస్తున్న కీలక పాత్రపై చర్చించడానికి ప్రఖ్యాత శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, పరిశోధకులు, విద్యార్థులను ఒకచోట చేర్చిన ఈ కార్యక్రమంలో పారిస్ లోని రెన్నెస్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ రెన్ గ్రే, ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ చాడ రాజిరెడ్డి విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ప్రపంచ ఆరోగ్య సవాళ్లను పరిష్కరించడంలో రసాయన, జీవ శాస్త్రాల ప్రధాన భూమికను వారు వివరించారు. ప్రొఫెసర్ రెన్ గ్రే నూతన కైనేస్ ఇన్హిబిటర్ల ఆవిష్కరణ, ఔషధ రసాయన శాస్త్రంలో సుస్థిరతపై మాట్లాడారు. మానవ కైనోమ్ లో 538 ప్రోటీన్ కైనేసులున్నాయని, ఇమాటినిబ్, సోరాఫెనిబ్, సునిటినిబ్ సహా దాదాపు వంద ఎఫ్డీఏ ఆమోదిత ప్రోటీన్ కైనేస్ ఇన్హిబిటర్లు (పీకేఐలు) అందుబాటులో ఉన్నాయని, వాటిలో సుమారు 85 శాతం క్యాన్సర్ చికిత్సకు ఉపయోగిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం





400కు పైగా కైనేస్ ఇన్హిబిటర్లు క్లినికల్ అభివృద్ధి దశలో ఉన్నాయని, ఇది 9.8 శాతం వార్షిక వృద్ధి రేటుతో, సుమారు 64 బిలియన్ల పౌండ్ల విలువైన వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్ కు ప్రాతినిధ్యం వహిస్తోందన్నారు. గీతం విశిష్ట ఆచార్యుడు, డీఎస్టీ పూర్వ కార్యదర్శి డాక్టర్ శ్రీవారి చంద్రశేఖర్ మాట్లాడుతూ, శాస్త్రీయ ఆవిష్కరణలు వేగవంతం చేయడానికి, పరిశోధనలను అర్థవంతమైన సామాజిక ప్రయోజనాలుగా మార్చడానికి రసాయన, జీవ శాస్త్రాలతో పాటు పదార్థ విజ్ఞాన శాస్త్రాల మధ్య అంతర్ విభాగ సహకారాన్ని పెంపొందించాల్సి ఉందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా మాట్లాడుతూ, అత్యాధునిక పరిశోధలను ప్రోత్సహించడానికి, అర్థవంతమైన శాస్త్రీయ పరస్పర చర్యలకు వేదికలను సృష్టించడంలో గీతం నిబద్ధతను చాటిచెప్పారు. సంక్లిష్టమైన శాస్త్రీయ, ఆరోగ్య సంరక్షణ సమస్యలను పరిష్కరించడానికి బహుళ విభాగాల విధానాలను అవలంబించాలని ఆయన విద్యా , పరిశోధకులను ప్రోత్సహించారు. ఈ సెమినార్ లో అధ్యా పకులు, పరిశోధకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పదార్థ విజ్ఞాన శాస్త్రం, ఔషధ రసాయన శాస్త్రం, జీవ పరిశో ధనలలో అభివృద్ధి చెందుతున్న పోకడలపై నిపుణుల ఉపన్యా సాలు, ఆసక్తికరమైన చర్చల నుంచి వారు ప్రయోజనం పొందా రు. ఈ కార్యక్రమాన్ని రసాయన శాస్త్ర విభాగానికి చెందిన డాక్టర్ గౌసియా బేగం, డాక్టర్ ఎ.రత్నమాల సమన్వయం చేశారు.

# అమీన్‌పూర్‌లో 'ప్రసాద్' యాక్షన్ ప్లాన్..
# నిబంధనలు విస్మరించిన బిల్డర్ల గుండెల్లో రైళ్లు!

**నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేని సెల్లార్.. బిల్డింగ్ సీజ్ చేసిన ఏసీపీ ప్రసాద్**








**అమీన్‌పూర్, జూలై 14:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలో అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న బిల్డర్ల ఆటకట్టిస్తున్నారు టౌన్ ప్లానింగ్ ఏసీపీ ప్రసాద్. పటేల్‌గూడలో తీసుకున్న చర్యల వేడి తగ్గకముందే, తాజాగా చక్రపురి కాలనీలో నిబంధనలను బేఖాతరు చేస్తున్న ఒక అక్రమ నిర్మాణాన్ని గుర్తించి ఏసీపీ ప్రసాద్ నేరుగా రంగంలోకి దిగారు. టీపీబీఓ రోహన్ ఠాకూర్ తో కలిసి నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఆ బిల్డింగ్‌తో పాటు, ముఖ్యంగా అనుమతులు లేని సెల్లార్‌ను సీజ్ చేసి అధికారుల సత్తా చాటారు.

**మాటే శాసనం.. హెచ్చరికలు బేఖాతరు చేస్తే చర్యలే!**
ఈ సందర్భంగా ఏసీపీ ప్రసాద్ బిల్డర్ల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, "ఎన్నిసార్లు చెప్పినా, ఎన్ని నోటీసులు ఇచ్చినా బిల్డర్లు వారి పని వాళ్ళే చేసుకుంటూ పోతున్నారు. ముఖ్యంగా అనుమతులు లేని సెల్లార్ల నిర్మాణంపై తీవ్ర పరిణామాలు ఉంటాయి. అందుకే వినకుండా సీజ్ చేయడం జరిగింది. కేవలం సీజ్ చేయడమే కాకుండా, ఇలాంటి బాధ్యతారాహిత్యమైన పనులకు పాల్పడుతున్న వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తున్నాం" అని హెచ్చరించారు.

**అక్రమ నిర్మాణమైతే ఇక కూల్చివేతే!**
ముందుకు వెళ్తూ, "అప్పటికి కూడా బిల్డర్లు వినకపోతే, అనుమతులు లేని ఆ నిర్మాణాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, తక్షణమే కూల్చివేసే ప్రక్రియను కూడా చేపడతాం. అక్రమ కట్టడాలను ఉపేక్షించే ప్రసక్తే లేదు" అని ఏసీపీ ప్రసాద్ తేల్చి చెప్పారు. అధికారుల ఈ దూకుడుతో అమీన్‌పూర్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపట్టిన బిల్డర్లు ఇప్పుడు వణుకుతున్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటించాల్సిందేనని, లేదంటే భారీ మూల్యం చెల్లించక తప్పదని ఏసీపీ స్పష్టం చేశారు.

# హనుమాన్ నగర్‌లో జోరుగా కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ కార్యక్రమం.



**(కూకట్ పల్లి )**
కూకట్ పల్లి ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ హనుమాన్ నగర్ పోలింగ్ స్టేషన్ నెం.603 పరిధిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు (బిఎల్ ఓలు) ప్రమీల, ఎం. లలిత, ఆర్. రాజేశ్వరి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయడంతో పాటు, నింపిన ఫారాలను స్వీకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు బాలు యాదవ్, రవి తదితరులు పాల్గొని ఓటర్లను చైతన్యపరిచారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో ప్రతి అర్హుడైన ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకునేలా ఇంటింటికీ వెళ్లి ఫారాల పంపిణీ, స్వీకరణ చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను సరిచేసుకోవాలని వారు కోరారు. ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా బి ఎల్ ఓ లు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తూ, అవసరమైన ఫారాలను స్వీకరిస్తున్నారు.

# ఓటర్ల జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి:
# అమీన్‌పూర్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్



**అమీన్‌పూర్, జూలై 14:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
దేశవ్యాప్తంగా కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా పాల్గొనాలని అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ కోరారు. దాదాపు 25 సంవత్సరాల క్రితం ఏ విధంగా అయితే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందో, ఇప్పుడు కూడా కేంద్ర ప్రభుత్వం అదే స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవడం లేదా వివరాలను సరిచూసుకోవడం ఎంతో అవసరమని అన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల ప్రజలు, ఉన్న నివాసితులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇంటింటికీ జరుగుతున్న ఈ సర్వేలో సిబ్బందికి సహకరించాలని, తమ వివరాలను ఖచ్చితంగా నమోదు చేయించుకోవాలని నరసింహ గౌడ్ కోరారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం ద్వారానే బలమైన ప్రజాస్వామ్యానికి పునాదులు పడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారా?
# వెంటనే ఫిర్యాదు చేయండి..!

- ఫొటో లేదా వీడియో తీసి 8712663570కు పంపండి
- బాలానగర్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు పిలుపు



**బాలానగర్ జులై 15**
సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని బాలానగర్ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇతర వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలిగించే వారిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాలానగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు కోరారు. నిబంధనలు అతిక్రమించే వాహనదారుల ఫొటోలు లేదా వీడియోలను 8712663570 నంబర్‌కు పంపించి ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఈసందర్భంగా సీఐ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిగ్నల్స్ ఉల్లంఘించడం, రాంగ్ రూట్ దారిలో వాహనం నడపడం, ప్రమాదకరంగా డ్రైవింగ్ చేయడం, రోడ్డుపై ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వాహనాలు నడపడం వంటి చర్యలను ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న సీఐ శ్రీనివాసరావు, ట్రాఫిక్ నిబంధనలను ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో ప్రమాదాలను తగ్గించి, సురక్షితమైన రవాణా వ్యవస్థను నెలకొల్పడం సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను గౌరవించి, బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించడం ద్వారా రోడ్డు భద్రతకు తమ వంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రజల గుండెల్లో స్థానం సంపాదిస్తూ...
# సేవతో ముందుకు సాగుతున్న భూక్య జంపన్న

- 30వ విడత మెగా ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం
- 44 మందికి శస్త్రచికిత్సల కోసం ఎంపిక











**(వెంకటాపురం) ములుగు జిల్లా ప్రతినిధి జూలై 14**
ప్రజాసేవనే పరమావధిగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య జంపన్న ఆధ్వర్యంలో వెంకటాపురం మండల కేంద్రంలో నిర్వహించిన 30వ విడత మెగా ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. శిబిరంలో కంటి సమస్యలతో బాధపడుతున్న పేదలు, వృద్ధులకు నిపుణులైన వైద్యులచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా, శస్త్రచికిత్స అవసరమైన 44 మందిని గుర్తించి, హైదరాబాద్‌లోని శంకర కంటి ఆసుపత్రికి ప్రత్యేక బస్సు ద్వారా తరలించారు. గత రెండున్నర సంవత్సరాలుగా ములుగు జిల్లాలోని గ్రామాల వారీగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ వేలాది మంది నిరుపేదలకు చూపును అందించే సేవా కార్యక్రమాలను భూక్య జంపన్న నిరంతరంగా కొనసాగిస్తున్నారు. ఆయన చేపడుతున్న ఈ సేవా కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ఈ సందర్భంగా భూక్య జంపన్న మాట్లాడుతూ, "పేద ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాను. నేను చేస్తున్న సేవను చూసి కొందరు తప్పుడు ప్రచారం చేసినా వాటిని ఏమాత్రం పట్టించుకోను. ప్రజలే నాకు బలం, వారి ఆశీస్సులే నా ఆస్తి. ప్రజల ఆశీర్వాదం ఉన్నంత వరకు సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తాను" అని అన్నారు. అలాగే త్వరలో ములుగు జిల్లాలోని ప్రతి గ్రామానికి, ప్రతి గడపకు వెళ్లి ప్రజల ఆశీర్వాదం కోరనున్నట్లు తెలిపారు. "మీ ఇంటికి మీ ఆశీర్వాదం కోసం వస్తాను. మీ ప్రేమ, మీ ఆశీస్సులు ఎల్లప్పుడూ నాకు ఉండాలి" అని ఆయన పేర్కొన్నారు. శిబిరం ద్వారా లబ్ధి పొందిన వృద్ధులు, పేద కుటుంబాలు మాట్లాడుతూ, కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న తమకు భూక్య జంపన్న ఇంటి పెద్ద కొడుకులా అండగా నిలిచారని తెలిపారు. తమ జీవితాల్లో మళ్లీ వెలుగులు నింపిన ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో ప్రజాసేవను మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆశీర్వదించారు. ప్రజాసేవనే రాజకీయానికి పునాదిగా చేసుకుని ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించుకున్న భూక్య జంపన్న సేవలు ములుగు జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నాయని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వెంకటాపూర్ మాజీ మండల అధ్యక్షులు లింగాల రమణా రెడ్డి, మాజీ సర్పంచ్ సాదా యాదగిరి , చంటి భద్రయ్య బాదావత్ రాజ్ కుమార్ పోషల్ల వీరమల్లు నల్ల భద్రయ్య , నరెట్ల విజయేందర్ , నూనె రమేష్ , సోమిడి రవి చిక్కుల కళ్యాణి జహీర్ పాషా గారు, చిగురు దేవేందర్, తోట సంపత్ తదితరులు పాల్గొన్నారు..

# కండిషన్ లేని వాహనాలు..విద్యార్థుల ప్రాణాలతో చెలగాటాలు

- మొగుళ్ళపల్లిలో ప్రైవేట్ పాఠశాలల వాహనాల తనిఖీలను చేపట్టిన ఏఆర్టీవో సుందర్ నాయక్
- రెండు టాటా మ్యాజిక్ వాహనాలు సీజ్



**మొగుళ్ళ పల్లి ప్రతినిధి జూలై 14**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలో ప్రైవేట్ పాఠశాలల వాహనాల తీరు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతుంది. దీంతో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆదేశాల మేరకు మంగళవారం మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని బ్రిడ్జి వద్ద రవాణా శాఖ అధికారులు తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా పర్లపెల్లి గ్రామంలో గల ఎస్వీ పాఠశాలకు చెందిన టాటా మ్యాజిక్ తో పాటు మండల కేంద్రంలోని కేశవ హై స్కూల్ పాఠశాలకు చెందిన టాటా మ్యాజిక్ లను సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్ కు అప్పగించారు. ఈ సందర్భంగా ఏఆర్టీవో సబ్ ఇన్స్పెక్టర్ సుందర్ నాయక్ మాట్లాడారు. కాలం చెల్లిన వాహనాలతో విద్యార్థులను పాఠశాలలకు తరలించడం మూలంగా ఆ వాహనాలు ప్రమాదాలకు గురై అనేకమంది విద్యార్థులు ప్రాణాలను కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. అదేవిధంగా ఫిట్నెస్, వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవర్ లైసెన్సులు, ఇన్సూరెన్స్, పొల్యూషన్ లాంటి పత్రాలు లేని వాహనాలను కూడా సీజ్ ఆయన చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు తుక్కు పట్టిన టాటా మ్యాజిక్ లలో, ఆటోలలో విద్యార్థులను పరిమితికి మించి తీసుకెళ్లి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటలాడొద్దన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు విద్యార్థులను తరలించే ఫిట్నెస్ లేని వాహనాలపై, ఆటోలపై, టాటా మ్యాజిక్ లపై నిరంతరం నిఘా ఉంచి వాటిని ఎప్పటికప్పుడు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..